విద్యార్థినికి గోల్డ్‌మెడల్

లక్షెట్టిపేట, నవంబరు, 16 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ట్రినిటీ పాఠశాలకు చెందిన అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పథకం కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ జోసఫ్ ఆదివారం తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి 69వ అథ్లెటిక్స్ 2025-26 చాంపియన్ షిప్ పోటీల్లో రోషిణి అనే విద్యార్థిని డిస్కస్ త్రోలో అత్యున్నతమైన ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిలవడంతో పాటు బంగారు పతకం కైవసం చేసుకోవడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరం

చెన్నూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 8వ జాతీయ నేచురోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శివలింగాపూర్‌లోని సత్య నేచర్ క్యూర్ యోగా, ఆయుర్వేద రిట్రీట్‌లో మంచిర్యాలకు చెందిన మైత్రి యోగా నేచర్ క్యూర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమీర, డాక్టర్ సుకుమార్‌లు నేచురోపతి చికిత్సలు, యోగా, జీవనశైలి మార్పుల ద్వారా ఎలా ఆరోగ్యంగా ఉండవచ్చో వివరించారు. ప్రతి ఒక్కరు యోగా, ధ్యానం చేయాలని, పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్వర్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పాషా, సత్య నేచర్‌క్యూర్ వ్యవస్థాపకులు సత్యనారాయణరెడ్డి, చర్మ వ్యాధుల నిపుణులు డాక్టర్ సూర్యనారాయణ, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



వెలవెలబోతున్న మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తగ్గుముఖం పట్టిన డాక్యుమెంటేషన్...

ఎన్నికల కోడ్ ప్రారంభమైన నాటి నుంచి రిజిస్ట్రేషన్లు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. అంతకు ముందు సగటున నిత్యం 80 డాక్యుమెంట్ల వరకు రాగా, ఎన్నికల సమయంలో వాటి సంఖ్య సగానికి పడిపోయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నెలకు రూ. కోటిపైగా సమకూరిన ఆదాయం, ఆ తరువాత అందులో సగానికి పడిపోయింది.

గాడిన పడేనా?

- దయనీయ పరిస్థితుల్లో స్థిరాస్థి వ్యాపారులు
- పూర్తిగా మందగించిన ప్లాట్ల అమ్మకాలు
- చతికిలపడ్డ నాన్ లే అవుట్ వెంచర్లు
- బిల్డర్ల పరిస్థితీ అంతంత మాత్రమే
- ఇతర రంగాలపైనా ప్రభావం

మంచిర్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా చతికిలబడింది. ఆ రంగంపై ఆధారపడ్డ వ్యాపారులు, మధ్యవర్తుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వెంచర్లు ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు పెద్ద మొత్తంలో అప్పులు చేసి స్థలాలు కొనుగోలు చేసినప్పటికీ, భూముల సబ్ డివిజన్లకు రిజిస్ట్రేషన్లు జరుగకపోవడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్లాట్లు కొను గోలు చేసేందుకు వినియోగదారులు ముందుకు రాక పోవడంతో చేసిన అప్పుల వడ్డీలు తీర్చేందుకు కొత్త అప్పులు చేస్తూ పీకల్లోతు ఊబిలో మునిగిపోయారు. ముఖ్యంగా నాన్ లే అవుట్ వెంచర్లు ఏర్పాటు చేసిన వ్యాపారుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైం ది. రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగానికి ఏ మాత్రం కలిసి రాకపోవడం, దాని ప్రభావం ఇతర రంగాల పై కూడా పడటంతో జిల్లాలో బిజినెస్ అంతా కుదేలైంది.

అసెంబ్లీ ఎన్నికలతో మొదలు..

అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు భారీగా పడిపోగా, ఆ తరువాత కూడా పుంజుకోకపోవడంతో నగదు చలామణిలేక రియల్ ఎస్టేట్ రంగం కునారిల్లుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లోకి రావడంతో నగదు చలామణి ఆగిపోయింది. ఆ ఎన్నికలు ముగిసి 'కోడ్' ఎత్తివేసినా రియల్ ఎస్టేట్ బిజినెస్ పుంజుకోకపోవడం గమనార్హం. భూముల క్రయ, విక్రయాలు పూర్తిగా నిలిచిపోగా, వినియోగదారులు లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఎన్నికల కోడ్ రాకముందు నిత్యం సగటున వంద వరకు రిజిస్ట్రేషన్లు జరుగగా "కోడ్" అమల్లోకి వచ్చిన తరువాత ఒక్కసారిగా వాటి సంఖ్య సగానికి పడిపోయింది. రిజిస్ట్రేషన్ల సమయంలో భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా, కోడ్ కారణంగా వాటిని తీసుకెళ్లడం కష్టసాధ్యంగా మారింది.

నగదు తరలించే సమయంలో పోలీసులకు దొరికిపోతే డబ్బంతా సీజ్ అయ్యే అవకాశం ఉండటంతో స్థిరాస్థి వ్యాపారులు భూముల క్రయ, విక్రయాల జోలికి వెళ్లలేదు. ఎన్నికల ప్రక్రియ ముగిసి పరిస్థితులు అనుకూలంగా మారినా బిజినెస్ ఊపందుకోలేదు. ఆ తరువాత ఎంపీ ఎన్నికలు, అనంతరం పంచాయతీ ఎలక్షన్లకు షెడ్యూలు విడుదల కావడంతో పరిస్థితిలో ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు.

పంచాయతీ ఎన్నికలతో మళ్లీ బ్రేక్....

రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పరిస్థితులు మెరుగుపడతాయని భావించిన రియల్టర్లకు ఆశనిపాతమే ఎదురైంది. ప్రస్తుతం పంచాయతీ...

(తరువాయి 7లో)

కూరగాయల సాగు రైతులకు లాభదాయకం

మంచిర్యాల క్లస్టర్ ఉద్యానవన శాఖ అధికారి సహజ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : క్లస్టర్ పరిధిలో కూర గాయల సాగు పరిస్థితి ఏంటి ?

సహజ : మంచిర్యాల క్లస్టర్ పరిధిలోని మంచిర్యాల నియోజకవర్గంతో పాటు జన్నారం మండలం కలుపుకొని సుమారు 300 ఎకరాల వరకు వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు రైతులు. ఇందులో ప్రధానంగా టమాట, మిర్చీ, చిక్కుడుకాయ, బీరకాయ, అలసంద, గోబి, ఆకు కూరలు సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : కూరగాయల సాగులో రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారా ?

సహజ : ప్రస్తుతం కూరగాయలు సాగు చేసే రైతులకు అర ఎకరం పందిరిసాగు చేస్తే ఖర్చు అయ్యే లక్ష రూపాయలలో 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుంది. అలాగే డ్రిప్ ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీతో లభిస్తుంది. దీనికి జీఎస్టీ కూడా వర్తిస్తుంది. పందిరిసాగులో అంతరపంటగా ఆకు కూరలు వేసుకోవచ్చు. ప్రభుత్వ నియమాలకు లోబడి ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : ఉద్యాన పంటలలో లాభదాయకమైన పంట ఏది ?

సహజ : కూరగాయల సాగుతో పాటు ఆయిల్‌ఫాం తోటల పెంపకం లాభసాటిగా ఉంటుంది. దీనికి గాను ప్రభుత్వం ఉచితంగా మొక్కలను అందిస్తుంది. రూ. 190 విలువ గల మొక్క రైతులకు కేవలం రూ. 20 ధరతోనే ఇస్తుంది. నాలుగేళ్ల డ్రిప్ మెంటెనెన్స్ కోసం ఒక సంవత్సరానికి రూ. 4200 రూపాయలు అందజేస్తుంది. ఎకరంలో 57 అయిల్ ఫాం మొక్కలను నాటుకోవచ్చు. ఎన్ఎంఈవో పథకం కింద ఈ పంట సాగు చేయబడుతుంది.

ఆంధ్రజ్యోతి : కూరగాయల సాగులో రైతులు పాటించే మెలుకువలు ?

సహజ : ముఖ్యంగా కూరగాయల సాగులో డ్రిప్ వాడకం ద్వారా కలుపును నివారించుకోవచ్చు. పాంఆయిల్ తోటలలో డ్రిప్ వాడకం ద్వారా అంతర పంటలను సాగు చేసుకుంటూ కొత్తిమీర, ఆకు కూరలైన పాలకూర, తోటకూర వంటి పంటలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుంది. కూరగాయల తోటల్లో మల్చింగ్ విధానం ద్వారా రైతులు కలుపు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి పొందే అవకాశం ఉంది. మంచిర్యాల క్లస్టర్ పరిధిలో కూరగాయల పంటలకు అనువైన భూమిని గుర్తించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-హాజీపూర్,(ఆంధ్రజ్యోతి)

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తెలంగాణ జన సమితి

ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

మంచిర్యాల క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణ పాలన, ప్రజల కోసం నిజాయితీగా పని చేసే ప్రత్యామ్నాయ రాజకీయ జన శక్తిగా తెలంగాణ జన సమితి నిలుస్తుందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంచిర్యాల పట్టణంలో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబన్న అధ్యక్షత వహించారు. అందెశ్రీకి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దాడులను ప్రస్తావిస్తూ ఇప్పుడు రాష్ట్రంలో స్వేచ్ఛ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా ప్రయత్నిస్తామన్నారు. ఓట్లు, నోట్లు కేంద్రంగా కాదు ప్రజల జీవితాలు, ప్రజల సమస్యలు కేంద్రంగా రాజకీయం జరగాలన్నారు. పలు తీర్మాణాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంచందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోనెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎండి సిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీరటి రాజన్న, విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షుడిగా బచ్చలి ప్రవీన్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం...

ప్రొపెసర్ కోదండరాం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న కోదండరాం, పక్కన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

నస్పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని, విద్యార్థులకు ఆత్మరక్షణకు కరాటే ఎంతోగానే ఉపయోగపడుతుందని జన సమితి అధినేత, ప్రొపెసర్ కోదండరాం అన్నారు. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయ్‌లో సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ పూపోటీలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి ప్రొపెసర్ కోదండరాం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ సింగరేణి ప్రాంతాల్లో అన్ని వర్గాలను కలుపుకుని మునీర్ ఉద్యమించాడన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు అశోక్, నరేష్, ప్రముఖ న్యాయవాది సంధాని, మయూర్, రేగళ్ళ ఉపేందర్, బీజేపీ నాయకుడు కమాలాకర్ రావు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని విజయవంతం చేయండి'

శ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సెక్రెటేరియట్ సభ్యుడు డి. బ్రహ్మానందం అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సభ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విప్లవోద్యమంలో చంద్ర పుల్లారెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత ఎంఎల్ పార్టీలకు ఉందన్నారు. సమసమాజ కోసం, ఆర్థిక సమానత్వం కోసం విద్యార్థి దశ నుంచే చంద్ర పుల్లారెడ్డి పోరాటాలు చేసి అమరుడయ్యారని అన్నారు. ఈ నెల 19న హైదరా బాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 41వ వర్ధంతి సభ నిర్వహిస్తామన్నారు. సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, శంకర్, సత్యం, భీముని పోశం, సికిందర్, శంకర్, సుధాకర్, గొట్టి శ్రీనివాస్, సోమయ్య, సదానందం, శంకర్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు

మంచిర్యాల క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పాత మంచిర్యాల శ్రీ లక్ష్మి కాలనీలో ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఓఎంసీసీ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఎక్సైజ్, ఇంటలీజెన్స్, ఆర్టీఏతో పాటు ప్రైవేటు క్రీడాకారుల జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఓఎంసీసీ సీనియర్ క్రీడా కారులు ఆమోస్, ప్రభాకర్, సంతోష్ పాల్గొన్నారు.

మాలల రణభేరి సభను విజయవంతం చేయాలి



సభ కరపత్రాలను విడుదల చేస్తున్న మాలమహానాడు నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న సరూర్ నగర్ గ్రౌండ్‌లో జరిగే మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లన్నలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాలలకు విద్య, ఉద్యోగాల్లో తక్కువ అవకాశాలు వస్తున్నాయని ఈ అన్యాయంపై ప్రశ్నించడంతో పాటు ఎస్సీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ శాతాన్ని పెంచడం, కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వం మాలల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అనంతరం సభ కరపతఆ్రలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్, నాయకులు మధుకర్, మల్లయ్య, నారాయణ, చిన్నయ్య, రమేష్, చంద్రశేఖర్, కొమురయ్య, మాంతయ్య, రాజలింగు పాల్గొన్నారు.

నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే

- వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయండి
- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

శ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కుమ్రంభీం-ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్‌లో ప్రారంభమైన బస్ జాత ఆదివారం సాయంత్రం శ్రీరాంపూర్ బస్టాండ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొద్ది మంది ఆస్తులు కూడబెట్టుకునేదుకు నరేంద్ర మోదీ సహకరిస్తున్నారని అన్నారు. ఆయన ప్రజలపక్షం కాదని, సంపన్నుల పక్షమని ఆరోపించారు. అధికారం లేకపోయినా ప్రజల కోసం పనిచేసేది తమ పార్టీ కార్యకర్తలేనన్నారు. వందేళ్లుగా ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా సీపీఐ నిలదొక్కుకుందన్నారు. అధికారం లేకపోతే నిలకడగా నిలబడలేని పార్టీలు ఉన్న ఈరోజుల్లో తాము ఏనాడు అధికారం కోసం వెంపర్లాడలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు పి. నర్సయ్య ఎన్నో సేవలందించారని కొనియాడారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల బహిరంగ సభ డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో జరుగనుందని, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, ప్రజానాట్య మండలి సభ్యుడు పల్లె నరసింహ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మేకల దాసు, జోగుల మల్లయ్య, కారుకూరి నగేష్, లింగం రవి, బాజీసైదా, మిరియాల రాజేశ్వర్ రావు, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్ పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

దండేపల్లి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చట్టబద్దత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి వెంటనే తొలగించాలని తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, ఆదివాసి సేనా మండల అధ్యక్షుడు ఆత్రం జలపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దండేపల్లిలో ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 23న ఆదివాసీ ధర్మయుద్ధం పేరుతో నిర్వహించే చలో ఊట్నూర్‌లో తలపెట్టిన హలో ఆదివాసీ చలో ఊట్నూర్ సంబంధించిన వాల్ పోస్టర్‌లను నాయకులు ఆవిష్కరించారు. ఆదివాసీ హక్కులు, అడవి జీవన విధానం, సంప్రదాయాలు, సంస్కృతి ప్రత్యేకమైనవని, లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చిన తర్వాత గిరిజనులకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందన్నారు. ఊట్నూర్‌లో తలపెట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గిరిజన సంఘాల నాయకులు మాధవరావు, లాల్‌సాబ్, దీర్ఘ భీమ్‌రావు పాల్గొన్నారు.

కాసిపేట : ఈ నెల 23న ఉట్నూరులో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు అన్నారు. ఆదివారం కొండాపూర్ యాప వద్ద ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరుతూ పోరాటాలు చేస్తున్నామన్నారు. చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని చేపట్టిన హలో ఆదివాసీ చలో ఉట్నూరు కార్యక్రమానికి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు.

శివపార్వతుల కల్యాణ మహోత్సవం



శివపార్వతులను తీసుకొస్తున్న జక్కు రమేశ్ దంపతులు

జన్నారం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్య వైశ్య భవన్‌లో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబా వంద రోజుల జయంతి పుస్కరిం చుకొని లక్షెట్టిపేట సత్యసాయి సేవా సమితి, జన్నారం, కవ్వాల్ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. జక్కు రమేశ్ దంపతులు విగ్రహ ప్రతిమలను తీసుకొచ్చి అంగరంగ వైబవంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సబ్యులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలి

డిప్యూటీ డైరెక్టర్ చాతరాజు దుర్గాప్రసాద్



విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న దుర్గా ప్రసాద్

లక్షెట్టిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చాతారజు దుర్గా ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. వసతిగృహ పరిసరాలతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ హస్టల్‌లో రోజు అందిస్తున్న మినూపై ఆరా తీసారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతే కాకుండా ఆదివారం స్పెషల్ డే సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చలికాలం జాగ్రత్తగా ఉండాలన్నారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌డబ్లువో రాజు ఉన్నారు.

చలికాలం ప్రయాణం జరభద్రం..

- రహదారిపై కమ్మకుంటున్న పొగమంచు
- జాగ్రత్తలు వహించకుంటే ప్రమాదమే..

దండేపల్లి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలికాలం వచ్చిందంటే చాలు దాదాపు ఉదయం పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముఖ్యంగా ప్రధాన రహదారుపై వాహనాలు కనిపించక పోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువ జరుగుతుంటాయి. పొగమంచులో వాహనం నడపడం ఓసాహసమే ఎందుకంటే ఎదురుగా వచ్చిన వాహనాన్ని దగ్గరగా వచ్చిన తర్వాత గానీ గుర్తించలేము. ఇలాంటి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. శీతాకాలంలో అత్యధికంగా ప్రమాదాలు పొగమంచు కారణంగానే జరుగుతుంటాయి. పొగ మంచు ఉండే సమయాల్లో వాహనచోదకులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

ప్రమాదాలకు కారణాలు ఇవే ..

- పొగమంచు సమయంలో అధికవేగంతో వాహనాలు నడపడం
- దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో రోడ్డు మార్గం ఉండటం
- రహదారులపై రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడం
- వాహనచోదకులు మద్యం మత్తులో ఉండి వాహనాలు నడపడం
- రహదారుల పక్కనే వాహనాలు నిలపడం
- మూలమలుపుల చోట వేగంగా వెళ్లడం..
- వాహనం నడిపే వ్యక్తికి నిద్రలేక పోవడం..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవి..

- మంచు కురిసే సమయంలో వాహనాలు నడకపోవడం మంచింది.
- రహదారిపై మంచు తీవ్రత పెరిగితే సురక్షితమైన ప్రాంతంలో పార్కింగ్ చేసుకోవాలి.
- కార్లు, ద్విచక్ర వాహనాలపై వీలైనంత తక్కువ దూరం ప్రయాణం చేస్తే ఎంతో మేలు.
- ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించేలా హెడ్ లైట్స్ ఆన్ చేయాలి
- వాహనాలకు తప్పని సరిగా వైపర్స్ ఉండాలి. అది పని చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వాహనానికి రేడియం స్టిక్కర్లు అతికించాలి.
- వాహనానకి అమర్చిన రెడ్ సిగ్నల్ ,బేక్ సిగ్నల్ పనితీరు సరి చేసుకోవాలి.



పొగ మంచుతో రహదారిపై లైట్లు వేసుకుని వస్తున్న వాహనాలు (ఫైల్‌ఫోటో)

సైబర్ క్రైంలో ఇద్దరు కీలక నిందితుల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వహిదుద్దీన్

కాగజ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ట్రేడింగ్ పేరిట మోసం చేసిన ఇద్దరు కీలక సైబర్ నిందితులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ వహిదుద్దీన్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పుణేకు చెందిన సంతోష్ కుశాల్ చంద్ తౌవర్, గుజరాత్‌కు చెందిన పటేల్ దవల్ కుమార్‌లకు ట్రేడింగ్ వ్యాపారంలో వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసినట్టు తెలిపారు. ఇందులో ఫేక్ ఎకౌంట్‌లో లాభాలు వచ్చినట్టు స్క్రీన్ షాట్లు పెట్టినట్టు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పలువురు ఈ గ్రూపుల్లో చేరి పెట్టుబడులు పెట్టినట్టు పేర్కొన్నారు. రూ.76లక్షలు పెట్టుబడులు పెట్టాగానే ఈ గ్రూపులను పూర్తిగా తొలగించినట్టు పేర్కొన్నారు. దీంతో తాము మోస పోయినట్టు పెట్టుబడిదారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. టౌన్ సీఐ ప్రేంకుమార్, ఎస్సై సుధాకర్, ప్రశాంత్, యాదగిరి ఆధ్వర్యంలో బృందాలు తిరిగి గుజరాత్ రాష్ట్రంలో పక్కా ఆధారాలతో పట్టుకున్నట్టు తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని పేర్కొన్నారు. ఈ మేరకు సంతోష్ కుశాల్ చంద్ తౌవర్, పటేల్ దవల్‌లను అరెస్టు చేసినట్టు పేత్కొన్నారు. కీలక కేసు చేినట్టు పోలీసు బృందాన్ని ఆయన అభినందించారు.

రామాలయంలో చోరీ


హుండీని బద్దలు కొట్టిన నిందితులు

జన్నారం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేండ్లగూడెం (మందపల్లి)లో గల రామాలయంలోని హుండీని బద్దలు కొట్టి సుమారు 20 వేల నగదును దోచుకెళ్లినట్లు ఎస్‌ఐ గొల్లపల్లి అనూష తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీని బద్దలు కొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రాజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వంతెన లేక ప్రజల ఇబ్బందులు


వెల్గి గ్రామ సమీపంలోని వంతెన లేని ఒర్రె

వాంకిడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం వెల్గి గ్రామ సమీపంలోని ఒర్రెపై వంతెన లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెల్గి గ్రామంలో 10 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. దీంతో పాటు గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉంది. వెల్గి గ్రామం చుట్టుపక్కల గిరిజన విద్యార్థులు దాదాపు వందకు పైనా ఈ ఆశ్రమ పాఠశాలలోనే చదువుకుంటున్నారు. గ్రామం నుంచి మండల కేంద్రానికి రావాలంటే.. చుట్టు పక్కల గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను కలుసుకునేందుకు పాఠశాలకు వెళ్లాలంటే ఈ ఒర్రె దాటి వెళ్లాల్సి ఉంటుంది. కేవలం ద్విచక్ర వాహనాలతో పాటు ఎడ్ల పండి మాత్రమే ఈ ఒర్రెను దాటే అవకాశాలు ఉన్నాయి. కార్లు, అంబులెన్స్‌లు, ఈ ఒర్రె దాటే పరిస్థితి లేదు. పొరపాటున విద్యార్థులు ఏదైనా అనారోగ్యానికి గురై అత్యవసర సమయంలో ప్రజలతో పాటు విద్యార్థులను సైతం మండల కేంద్రానికి తీసుకువెళ్లలేని పరిస్థితి ఉంది. గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఎవరైనా ఉన్నతాధికారులు వెళ్లాలంటే అర కిలోమీటరు దూరంలో తమ వాహనాలను నిలిపివేసి ఒర్రె దాటి వెళ్లాల్సి వస్తుంది. గత ఏడాది పాఠశాలను సందర్శించేందుకు వెళ్లిన ఐటీడీఏ పీవో ఎడ్ల బండిపై ఎక్కి ఒర్రె దాటి పాఠశాలను సందర్శించాల్సి వచ్చింది. వెల్గి గ్రామ సమీపంలోని ఒర్రెపై వంతెన నిర్మించాలని కోరుతూ ఐటీడీఏ పీవోతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినితి పత్రాలు అందించామని గ్రామస్థులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సబ్సిడీ టార్పాలిన్ల కోసం నిరీక్షణ



- అద్దెకు తెచ్చుకుంటున్న రైతులు
- ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ కరువు
- పట్టించుకోని ప్రభుత్వం
- ఏటా రైతులకు అవస్థలు

కాగజ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను అరబెట్టుకోవటానికి వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాల నుంచి పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు టార్పిలిన్లు రైతులకు ఇప్పుడు అత్యవసరం. దీంతో గతంలో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను రైతులకు సరఫరా చేసేది.

కానీ ఏడు సంవత్సరాల నుంచి ప్రభుత్వం టార్పాలిన్ల పంపిణీని నిలిపివేసింది. మార్కెట్‌లో టార్పలిన్ల ధరలు అధికంగా ఉండటంతో టార్పాలిన్లను కొనలేక రైతులు అద్దెకు తెచ్చుకుంటున్నారు. వర్షాలు, ప్రకృతి విపత్తుల నుంచి పంటలను రక్షించుకోవటానికి వ్యవసాయ శాఖ గతంలో సబ్సిడీపై రైతులకు టార్పిలిన్లు అందించేది. మార్కెట్‌లో 2,500 రూపాయలకు లభించే టార్పిలిన్లను 50 శాతం సబ్సిడీతో 1,250 రూపాయలకే ప్రభుత్వం రైతులకు అందించేది. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే టార్పాలిన్లు నాణ్యతతో పాటు ఎక్కువ కాలం మన్నికగా ఉండేవి. ఈ విధంగా రైతులకు పంపిణీ చేసేది. 2018 నుంచి టార్పాలిన్ల పంపిణీ చేపట్టకపోవటంతో రైతులు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రామాలు, పట్టణ శివారుల్లో పలువురు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి టార్పాలిన్లు కిరాయిలకు ఇస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు 15 రూపాయల నుంచి 20 రూపాయల వరకు అద్దెకు తెచ్చుకుంటున్నారు. ధాన్యం ఆరబెట్టుకోవటానికి సాధారణంగా ప్రతీ రైతు కనీసం ఆరు నుంచి 10 టార్పాలిన్లు అవసరం ఉంటుంది.

వాటిపై ప్రతీ రోజు అద్దెకు తెచ్చుకోవటంతో భారం పడుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లో వరి, కంది, ఇతర అంతర పంటలు సాగు చేసిన రైతులకు ధాన్యం ఆరబెట్టేందుకు తమ పొలాల్లో వీటిని వాడుతారు. రైతుల ప్రయోజనం కోసం ఎంతగానో ఉపయోగపడే టార్పాలిన్లు సబ్సిడీపై పంపిణీ చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను వాకాబు చేస్తే పంపిణీ చేయటం లేదని తెలుపుతున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోత దశకు రావటంతో రైతులంతా కోత మిషన్లతో వరి పంటను కోయిస్తున్నారు. ఇప్పుడు అకాల వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏంటి..? పంటను ఎలా ఆరబెట్టుకోవాలి..? కనీసం టార్పాలిన్లు సరఫరా చేస్తే తాము ముందస్తుగానే కొనుగోలు చేసుకునే వాళ్లమని ఇప్పుడు దుకాణాల్లో కొనుగోలు చేయాలంటే అదనపు భారం వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే ధాన్యం లోడింగ్ చేసిన తర్వాత కూడా పైన కప్పుకునేందుకు సులువుగా ఉండేదని చెబుతున్నారు.

ఈ విషయమై వ్యవసాయాధికారి రామకృష్ణను వివరణ కోరగా, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు పంపిణీ చేయటం లేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి..
లెండుగురే శ్యాంరావు, బీఆర్‌ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్



ప్రభుత్వం రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వెంటనే సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా చేయాలి. రైతులు పంటలు పూర్తిగా పండించారు. ఎప్పుడు వర్షాలు కురుస్తాయో తెలియని పరిస్థితి. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లను సరఫరా చేయాలి. రైతులను ఆదుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా మృతి


తారాబాయి(ఫైల్)

రెబ్బెన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా తారాబాయి(50) మృతి చెందింది. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివ రాల ప్రకారం.. కొండపల్లికి చెందిన అంగన్ వాడీ ఆయా తారాబాయి తన భర్త దాదుబాయ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై రెబ్బెనకు వస్తున్నారు. ఈ క్రమంలో వెనక నుంచి మహారాష్ట్ర నుంచి వస్తున్న లారీ ఢీ కొనడంతో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తక్షణమే వారిని రెబ్బెన ఆరోగ్య కేంద్రానికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆరోగ్య కేంద్రం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


సంతోష్(ఫైల్)

రెబ్బెన, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ముంజం సంతోష్(28) అనే యువకుడు ఆదివారం ఇంట్లో పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణా లతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఆరోగ్య కేంద్రం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. ఈ మేరకు రెబ్బెన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది మరో యువకుడు...

మంచిర్యాల క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం సూర్యనగర్‌కు చెందిన చింతపండు ప్రశాంత్ (29) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చింతపండు ప్రశాంత్ మూడు సంవత్సరాల నుంచి మద్యానికి బానిసయ్యాడు. అతిగా తాగడం వల్ల ఆరోగ్యం క్షీణించింది. లివర్ చెడిపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం తెల్లవారు జామున ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నానమ్మ విజయ, మేనత్తలు గమనించి ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు

భీమిని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. బెల్లంపల్లి పట్టణానికి చెందిన గోమాస బాపు రాజారం గ్రామంలో పత్తి సాగు చేస్తున్నాడు. రాజారం గ్రామానికి వచ్చి తిరిగి బెల్లంపల్లికి వెళ్తుండగా అందవెల్లి గ్రామస్థులు ద్విచక్ర వాహనంపై రావడంతో ఎదురెదు రుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో గోమాస బాపు తలకు గాయాలయ్యాయి. స్థానికులు భీమినిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడ్డ బియ్యం, నిందితుడితో పోలీసులు

వేమనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలం మంగనపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్‌ఐ జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా టాటా ఏసీ వాహనంలో ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం మహరాష్ట్రలోని సిరోంచకు తరలిస్తున్న మంచిర్యాలకు చెందిన చింతల రమేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

కౌలు రైతులకు అవకాశం

సీసీఐలో పత్తి విక్రయించేందుకు

- కపాస్ కిసాన్ యాప్‌లో ఆప్షన్ కల్పించేలా అధికారుల కసరత్తు



వాంకిడి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తున్నా... కౌలు రైతులకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆప్షన్ లేదు. దీంతో కౌలు రైతుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో ఆప్షన్‌ను కల్పించారు. కపాస్ కిసాన్ యాప్‌లో కౌలు రైతులు కౌలు చేస్తున్న భూముల సర్వే నంబర్‌ను, భూమి వివరాలను నమోదు చేశాక సంబంధిత శాఖ అధికారులు పట్టాదారుకు ఫోన్ చేసి ఓటీపీ అడుగుతారు. సదరు పట్టాదారు ఓటీపీ చెబితేనే కౌలురైతు పత్తిని విక్రయించే అవకాశం ఉంది. అయితే చాలా మంది పట్టాదారులు కౌలుదారుకు కౌలు ఇస్తున్నట్లు ఎక్కడా అగ్రిమెంట్ చేసుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఓటీపీ చెబితే రానున్న రోజుల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా అని పట్టాదారులు కొంత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం సంబంధిత కపాస్ కిసాన్ యాప్ ద్వారా కౌలు రైతు పత్తి విక్రయించేలా వివరాలు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- తాజాగా అవకాశం..

కొద్ది రోజులుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకపోవడంతో అధికార యంత్రాంగం వెబ్‌సైట్ ను ఓపెన్ చేయకపోవడంతో పాటు ఏఈవోలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఉపయోగించడంలేదు. దీంతో కౌలు రైతులు పత్తి విక్రయించే అవకాశం లేకుండాపోయింది.

తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో కౌలు రైతులు సీసీఐలో పత్తి విక్రయించే అవకాశం కల్పి స్తూ నిర్ణయం తీసుకున్నారు. కౌలు రైతులు తమ పత్తిని సీసీఐకు విక్రయించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ విషయంపై పరిశీలిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి గోపికాంత్ తెలిపారు.

ఘన్‌పూర్‌లో కత్తిపోట్ల కలకలం


గాయపడిన చీర్ల రాకేష్

నెన్నెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెన్నెల మండలం ఘన్‌పూర్‌లో ఆదివారం సాయంత్రం కత్తి పోట్ల ఘటన కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా సూరారం గ్రామానికి చెందిన చీర్ల రాకేష్ మిత్రులతో కలిసి ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు నెన్నెల మండలం కోనంపేటకు కారులో వెళ్తున్నారు. నెన్నెల వైపు నుంచి వస్తున్న ఆటో ఘన్‌పూర్‌లో స్పీడ్ బ్రేకర్ వద్ద ఒకదానికి మరొకటి ఢీకొన్నాయి. ఈ విషయంలో జోగాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొడిపె అశోక్, కారు నడుపుతున్న రాకేష్ మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఆటో డ్రైవర్ తన ఆటోలో నుంచి కత్తి తీసుకొచ్చి రాకేష్‌ను ఛాతిలో రెండు పోట్లు పొడిచాడు. తేరుకునే లోపే అశోక్ ఆటోతో పారిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న నెన్నెల ఎస్సై ప్రసాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు అక్కడి నుంచి మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెల్లారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు. రాకేష్ స్వగ్రామం సూరారం కాగా హైదరాబాదులో ఓ మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తున్నారు. ఫంక్షన్‌కు వచ్చి కత్తిపోట్లకు గురయ్యారు.

కార్మికుల, ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటాలు

- రాష్ట్ర మహాసభల్లో నూతన గనుల కోసం తీర్మానాలు
- వెల్లడించిన సీఐటీయూ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగుల సమస్యల సాధనతో పాటు హక్కుల కోసం సమరశీల పోరాటాలు చేపడుతామని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం రామకృష్ణాపూర్ యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం సింగరేణి ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. కార్మిక ఉద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన ఏఐటీయూసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. అంతేగాకుండా ప్రతిపక్ష యూనియన్ ఐఎన్‌టీయూసీ కూడా ఉద్యోగులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సింగరేణిలో రెండు సంఘాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా యాజమాన్యం ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా నెలకొన్న ఉద్యోగుల సమస్యలతో పాటు యాజమాన్యం విధానాలపైన త్వరలో నిర్వహించబోతున్న రాష్ట్ర మహాసభల్లో ఎండగడుతామన్నారు. నూతన గనులు ఏర్పాటు చేయాలని సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మారుపేర్లు మార్చాలని, అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి త్వరగా పూర్తి చేయాలని, విజిలెన్స్ వద్ద పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మహాసభలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నిర్బంధ చట్టాలను కూడా రద్దు చేయాలని తీర్మానిస్తామని తెలిపారు. ఈ సభలను ప్రతి ఉద్యోగి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి మృతి


సతీష్ (ఫైల్)

మందమర్రిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బురదగూడెం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక మూడవ జోన్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి, ఐఎన్‌టీయూసీ నేత తోట సతీష్ (59) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్ బురదగూడెం వద్ద రోడ్డు దాటుతుండగా మంచిర్యాల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సతీష్ ఏరియాలోని కేకే 5 గనిలో సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉత్తమ కార్మికునిగా కూడా సతీష్ గుర్తింపు పొందాడు. ఆయన మృతితో కేకే 5 గనిలో విషాదం అలుముకొంది. వివిధ కార్మిక సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

మందమర్రిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనే తమ యూనియన్ లక్ష్యమని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస హక్కులు యాజమాన్యం కల్పించాలన్నారు. ఇప్పటికే కార్మికులు వెట్టి చాకిరీలో మగ్గుతున్నారని, సంస్థ అబివృద్ధిలో వారు కూడా భాగస్వాములవుతున్నారని తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని, లాభాల వాటా 5,500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కంది శ్రీనివాస్, జెట్టి మల్లయ్య, బానయ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రావు, కుమార్, ఓదెలు, శ్రీనివాస్, తిరుపతి, రాజేందర్, శ్రీనివాస్, తిరుపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రోడ్డు ఇలా..ప్రయాణించేది ఎలా?

- కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి - ప్రజలకు తప్పని ఇబ్బందులు


కంకర తేలిన సరండి రోడ్డు

వాంకిడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరండి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. మండల కేంద్రం నుంచి సరండి గ్రామం వరకు రోడ్డంతా కంకర తేలి, అడుగడుగునా గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనం కూడా సక్రమంగా నడపలేని పరిస్థితి నెలకొంది. ఇంధాని, ఖిరిడి, సరండి, కోలాంగుడ తదితర గ్రామాల నుంచి ప్రతి రోజు ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. ఈ మార్గం ద్వారా రవాణా సదుపాయం లేకపోవడంతో ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. మండల కేంద్రం నుంచి సరండి గ్రామం వరకు రెండు కిలోమీటర్లు మెర రోడ్డు కంకర తేలి అధ్వన్నంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డు మరీ దారుణంగా ఉంటుంది. వర్షాకాలంలో గుంతల్లో నిల్వ ఉన్ననీరు కనపడక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని పలు మార్లు పాలకులకు, ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- నిధులు విడుదల చేయాలి
దుర్గం శ్యాంరావు, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు



మండలంలో అనేక గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి, గుంతలు ఏర్పడి కొన్నేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోవడంలేదు. వివిధ గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు

నెన్నెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే వినోద్‌ను అకారణంగా విమర్శిస్తే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేష్ అన్నారు. బీజేపీ నాయకుడు కొయ్యల ఏమాజీ ఎమ్మెల్యేపై వాస్తవదూరమైన ఆరోపనలు చేస్తున్నారని అన్నారు. ఆదివారం నెన్నెలలో మండల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మచ్చలేని నాయకుడైన వినోద్‌ను విమర్శించే అర్హత ఏమాజీకి లేదన్నారు. వినోద్ చేసే అభివృద్ధి పనులను సహించ లేక తప్పుడు ఆరోపనలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడు లేని అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట శ్రీనివాస్, బానేష్, మోహీద్‌ఖాన్, రాజేష్, గజేందర్‌సింగ్, సాంబమూర్తి, శంకరయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో రాణించిన విద్యార్థులు

బెల్లంపల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): 5వ ఓపెన్ స్టేట్ లేవల్ నేషనల్ కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్ పోటీల్లో పట్టణంలోని అభ్యాస పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రాణించారని పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్ తెలిపారు. నస్పూర్ సీసీ సింగరేణి కళావేదికలో జరిగిన స్టేట్ లేవల్, నేషనల్ కరాటే కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి 20 మందికిపైగా విద్యార్థులు గోల్డ్‌మెడల్, పదిమందికిపైగా విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించారన్నారు. రాణించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రిని కలిసిన మాజీ కౌన్సిలర్

మందమర్రిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామిని రామకృష్ణపూర్ 23వ వార్డు మాజీ కౌన్సిలర్ పార్వతి విజయ మర్యాద పూర్వకంగా కలిశారు. హైద్రాబాద్‌లోని సోమాజిగూడ లో గల ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల జూబ్లిహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినందున మంత్రికి స్వీట్లు తినిపించి సన్మానించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విన్నవించారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

మంచిర్యాల క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లు సత్వరమే అమలు చేయాలని బీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీజేఏసీ ఆధ్వర్యంలో బాయ్స్ హైస్కూల్ ఆవరణలో బీసీ జస్టిస్ ఫర్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్ డా. నీలకంటేశ్వర్ గౌడ్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రాజేషం, తదితరులు పాల్గొన్నారు.

అతివలకు అండగా.. జెండర్ కమిటీలు

- మహిళల భద్రత, రక్షణ, సంక్షేమం దిశగా అడుగులు
- గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల ఏర్పాటు



చెన్నూరు మండలం కిష్టంపేటలో జెండర్ కమిటీని ప్రకటిస్తున్న అధికారులు



కాసిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ, భద్రత కోసం షీటీం, సఖి సెంటర్లు సమర్థ వంతంగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం మహిళ సంఘాలతో జెండర్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం జెండర్ కమిటీ లను నీరుగార్చి ఉనికిలో లేకుండా చేసింది. కానీ ఇప్పుడు ప్రభుత్వం జెండర్ కమిటీలను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు విడుదల చేసింది. దీంతో అధికారులు కమిటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మహిళలు ఎదుర్కొనే వివక్ష, వేధింపులు, బాల్య వివాహాలు, అనారోగ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. కమిటీలు మహిళలకు వివిధ సామాజిక సమస్యలపై అవగాహన కల్పిస్తూ వారిని చైతన్య వంతులుగా తీర్చిదిద్దడానికి దోహదపడతాయి. జిల్లాలో 459 గ్రామైక్య సంఘాలుండగా 10,139 స్వయం సహాయక సం ఘాలున్నాయి. వీటిలో 1,09,348 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి సంఘం నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను కమిటీలోకి తీసుకోనున్నారు. ఈ కమిటీలు షీటీం, సఖి సెంటర్లతో సమానంగా పని చేయనున్నాయి.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

మహిళలు సామాజిక కుటుంబ, ఆరోగ్యం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో కొన్నింటిపై చర్చ జరిగినా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళలకు అండగా ఉండేందుకు జెండర్ కమిటీల ప్రక్రియను ప్రారంభించింది. ముఖ్యంగా లింగ వివక్షత, బాల్య వివాహాలు, అత్తగారింటి వేధింపులు, సమాజంలో మహిళలకు ఎదురయ్యే అవమానాలు, అనారోగ్యం వంటి సమస్యలపై అవగాహన కల్పించడమే కమిటీల ముఖ్య ఉద్దేశ్యం, కొన్నిసార్లు మహిళల వేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందుతుంటారు. సంఘంలో చెబితే సమస్యలు పరిష్కరించబడతాయి. ఇవే కాకుండా పోషకాహారలో పాలు, మానవ అక్రమ రవాణా నిరోధం, గృహ హింస కేసులు, కుటుంబ తగాదాలు వంటి కేసుల్లో సైతం ఈ కమిటీలు చొరవ చూపుతాయి.

బాల్య వివాహాలను కట్టడి చేయడంలో క్రియాశీల పాత్ర పోషించను న్నా యి. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఈ జెండర్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీల్లో 25 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సున్న చదువుకున్న మహిళలకు ప్రాధాన్యతగా ఎంపిక చేస్తారు. ప్రాథమిక స్థాయిలో సమస్యలను గుర్తించి గ్రామస్థాయిలోనే పరిష్కరిస్తారు. లేదంటే మండల, జిల్లా స్థాయికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపడమే ఈ కమిటీల ముఖ్య ఉద్దేశ్యం.

జిల్లాలో గతేడాది 196 కేసులు

మంచిర్యాల జిల్లాలో గత ఏడాది 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వివిధ కేటగిరీల్లో కేసులు నమోదయ్యాయి. 97 గృహ హింస కేసులు నమోదు కాగా, 20 ఆడపిల్లల అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి. రెండు పోక్సో కేసులు, 28 బాలికలు ఇంటి నుంచి పారిపోవడం లేదా కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. ఇలాగే 20 మోసం, ప్రేమ వివాహాల కేసులు నమోదు కాగా మరో 20 వరకట్న వేధింపుల కేసులు నమోదయ్యాయి. 9 ఇతర కేసులు నమోదు కావడంతో మహిళలపై జరుగుతున్న దాడులకు ఈ కేసులు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు వివిధ కేటగిరీల్లో 99 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా గృహ హింస కేసులు 60కి పైగా నమోదు కాగా బాలికలు ఇంటి నుంచి పారి పోయి ప్రేమ వివాహం చేసుకున్న కేసులు 18 నమోదయ్యాయి. ఏది ఏమైనా మహిళలపై జరుగుతున్న వివక్ష, దాడులు, కిడ్నాప్, ప్రేమ పేరుతో మోసాలకు గురై వంచించ బడడాన్ని నిరోధించేందుకు జెండర్ కమిటీలు ఎంతో ఉపయో గడపతాయని పలువురు పేర్కొంటున్నారు.

శిక్షలు కఠినంగా అమలు చేయాలి : బండ శాంకరి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, సామాజిక కార్యకర్త

మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టడానికి ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయాలి. జెండర్ కమిటీలు క్షేత్రస్థాయిలో మహిళలను చైతన్యవంతంగా తీర్చిదిద్దాలి. పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై తల్లులు ఇంట్లోనే అవగాహన కల్పించారు. సామాజిక అంశాలపై ప్రతి మహిళ అవగాహనతో మెలగాలి.



ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉంటాం

శ్రీలత, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్, మంచిర్యాల

ఆపదలో ఉన్న మహిళలకు, బాలికలకు సఖి కేంద్రం అండగా ఉంటుంది. అత్యాచార బాధితులకు, గృహహింసకు గురైన వారికి రక్షణ కల్పిస్తాం. బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వైద్య సేవలు అందించి తాత్కాలికంగా ఆశ్రయాన్ని ఇస్తాం. సఖి సేవలకు 181 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలి.



ఫిర్యాదులను గోప్యంగా ఉంచుతాం

: హేమ, ఎస్ఐ, షీటీం మంచిర్యాల

మహిళలు , బాలికలు వేధింపులకు గురైన విద్యార్థులు ర్యాగింగ్ బారిన పడినప్పుడు షీటీంకు సమాచారం ఇవ్వాలి. ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. పోలీస్ స్టేషన్‌కు రావడానికి ఇబ్బంది పడితే షీటీం సిబ్బంది ఇంటికి వచ్చి ఫిర్యాదు తీసుకుంటారు. మహిళల భద్రతకు షీటీం పటిష్టంగా పనిచేస్తుంది.



మహిళల్లో మనోధైర్యం కోసమే జెండర్ కమిటీలు

స్వర్ణలత, డీపీఎం, మంచిర్యాల

మహిళల్లో మనో ధైర్యం నింపేందుకు జెండర్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. జెండర్ కమిటీల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి మహిళలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం. నెల రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా కమిటీలను పూర్తి చేస్తాం. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన వారి చేత గ్రామీణ స్థాయిలో మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం.



గాడిన పడేనా..?

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల సమయం కావడంతో రియల్ ఎస్టేట్ ఊపందుకునే పరిస్థితులు కానరావడం లేదు. సాధారణంగా ప్రతియేటా నవంబరు నుంచి జూన్ మధ్యకాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపు మీద ఉంటుంది. ఈ కాలంలో భూముల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికల కాలం కావడం తో రియల్ ఎస్టేట్ రంగంపై దాని ప్రభావం పడింది. కనీసం ఈ ఏడాదైనా వ్యాపారం పుంజుకుంటుందని ఆశిం చిన రియల్ వ్యాపారులకు మళ్లీ గడ్డు పరిస్థితులే ఎదు రయ్యాయి. రెండు, మూడు ఎకరాల తక్కువ విస్తీర్ణం లో వెంచర్లు ఏర్పాటు చేసే వ్యాపారులు లే అవుట్‌కు వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలించవు. లే అవుట్‌కు వెళితే 10 శాతం భూమి స్థానిక సంస్థల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. తక్కువ విస్తీర్ణం కావడం, అందులోని కొంత భూమి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పేరిట మార్చాల్సి రావడంతో వచ్చే లాభాలు కాస్త ఆ భూమి రూపంలో కోల్పోవాల్సి వస్తుంది. ఈ కారణంగా వ్యాపారులు లే అవుట్ లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి, పరిచయం ఉన్న వారితో ప్లాట్లు కొనుగోలు చేయిస్తుంటారు. ప్రస్తుతం లే అవుట్ లేని వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచి పోవడంతో చిన్న వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది.

బుగ్గ మల్లన్న దేవాలయం రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భీమిని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి బుగ్గ మల్లన్న దేవాలయానికి ఆదివారం మండల బీఆర్ఎస్ నాయకులు మరమ్మతులు చేయించారు. వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతల మయం కావడంతో ట్రాక్టర్ సహాయంతో చదును చేయించి మట్టి మొరంతో గుంతలను పూడ్చారు. మరికొన్ని రోజుల్లో బుగ్గ మల్లన్న స్వామి దేవాలయానికి బోనాల కోసం అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు. ఈ మరమ్మతులతో భక్తుల కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా, నాయకులు బండి శ్రీకాంత్‌గౌడ్, అన్నపురం ఆనంద్‌గౌడ్, రాజేందర్, సూరం మల్లేష్, ఆకుల రాజేశం పాల్గొన్నారు.

అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటు

బెల్లంపల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అకాలమరణం తెలుగు సాహితి లోకానికి తీరని లోటని రచయిత సుదమల్ల వెంకట్, రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధూకర్ అన్నారు. ఆదివారం పట్టణంలో అందెశ్రీకి నివాళులు అర్పించి అందెశ్రీపైన రాసిన పాటను విడుదల చేసి మాట్లాడారు. అందెశ్రీ పేరు తెలంగాణ చిరస్మరణీయంగా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై ప్రజాకవి అందెశ్రీ పేరును ఎప్పటికి ఎవరు మరిచి పోలేమని ఉద్యమంలో ఆయన పాటలే ప్రదాన పాత్ర పోషించాయన్నారు. అందెశ్రీపై సదమల్ల క్రియేషన్స్ యూట్యూబ్ చానల్స్ ద్వారా పలు పాటలు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, దినేష్ కుమార్, సంపత్ రెడ్డి సీనియర్ క ళాకారులు శ్రీనివాస్, రాంచందర్, మల్లేశ్, లింగయ్యలు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు



గూడెంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న జంటలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ ద్వాదశి సందర్భంగా దండేపల్లి మండలం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినంకావడంతో ఉదయం నుంచే వేలాది మంది భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి సత్యదేవుడిని దర్శించుకున్నారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఏమ గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. 530మంది భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాలను నోముకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు ఆలయంలోని రావి చెట్టు, ప్రధానాలయ ఎదుట గల ధ్వంజస్తంబం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం కార్తీక మయంగా మారింది. వచ్చిన భక్తులకు అన్ని వసతులు కల్పించి తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరిండెంట్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్‌లు పేర్కోన్నారు.

విద్యుత్ మోటార్ కేబుల్ చోరీ

ఓదెల, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం రాత్రి నలుగురు రైతులకు చెందిన 80 మీటర్ల విద్యుత్ మోటార్లకు ఉండే రాగి వైర్ చోరీకి గురయ్యింది. గూడెంలో బుడిగె సతీష్ 30 మీటర్లు, వీర ముష్టి శ్రీనివాస్ 25 మీటర్లు, బుడిగె కుమారస్వామికి చెందిన 20 మీటర్లు, గుంపులకు చెందిన మరో రైతు సల్పాల ప్రశాంత్‌కు చెందిన 25 మీటర్లు మొత్తం 80 మీటర్ల రాగి వైర్ గుర్తు తెలియని దుండగలు ఎత్తుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం నారుమడులు సిద్ధం చే సుకునే సమయంలో రాగి వైర్లను దొంగిలించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క మోటార్‌కు ఉన్న వైరు మళ్లీ కొనుగోలు చేయాలంటే రూ. 3500 నుంచి రూ.4 వేల వరకు ఖర్చువ తుందని రైతులు పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థుల ఆందోళన

బెల్లంపల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాల విద్యా ర్థులు ఆదివారం పాఠశాల ముందు బైఠా యించి ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ గతేడాది క్రితం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ సోషల్ వేల్ఫేర్ భవనం శిథిలావస్థలో ఉండడంతో దాదాపు వంద మందికిపైగా వి ద్యార్థులను బెల్లంపల్లిలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు తరలించారన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్నామని మెనూ ప్రకారం భోజనం అందజేయడం లేదన్నారు. ఉదయం 11 గంటల వరకు టిఫిన్, మధ్యాహ్నం 3 గంటలకు భోజనం అందిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సిర్పూర్ సీవోఈ నుంచి బెల్లంపల్లి సీఈఓకి చదువుకోవడానికి వచ్చారని, ఉపాధ్యాయులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టిం చుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అన్ని వసతులు ఉన్న భవనానికి పంపించాలని కోరారు. దీంతో ఉపాధ్యాయులు ధర్నా నిరసన తెలుపుతున్న విద్యార్థుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని తెలుపడంతో ఆందోళన విరమించారు.



బెల్లంపల్లిలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉచిత చేప పిల్లల పంపిణీ



చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎంపీవో శ్రీపతి బాపురావు, నాయకులు

జైపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం ప్రవేశపెట్టిన ఉచిత చేపల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎంపీవో శ్రీపతి బాపురావు ప్రారంభించారు. మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలైన ఇందారం, కుందారం, బెజ్జాల, శెట్‌పల్లి, వేలాల, కాన్కూర్ పరిధిలోని 32 చెరువుల్లో 9.54 లక్షల చేప పిల్లలను విడుదల చేస్తామన్నారు. మత్స్యశాఖ అసిస్టెంట్ అధికారి శ్రావణ్, ఫీల్డ్ మెన్ రాజేష్, నీలం రవితేజ, మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షుడు బాలయ్య, గోపాల్, రాములు, వెంకటేశం, బాపు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలి

మందమర్రిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరుతూ పట్టణంలోని సింగరేణి పాఠశాలమైదానంలో ఆదివారం రన్ ఫర్ బీసీ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీలకు అణగదొక్కాలని చూస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. రాష్ట్రం బీసీ రిజర్వేషన్‌ల కోసం తీర్మానం చేసినా కేంద్రం అమలు చేయడం లేదన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. రాజ్యాధికారంతోనే బీసీల హక్కులు సాధ్యమవుతాయన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శంకర్, సతీష్, ప్రభాకర్, రాజు, సారంగపాణి, వేణుగోపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సీ హాస్టల్ భవనం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

చెన్నూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా వసతి గృహాల పరిస్థితి మారడం లేదు. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం హామీలకు పరిమితం అవుతుంది. ఇందుకు చెన్నూరులోని ఎస్సీట బాలుర హాస్టల్ పరిస్థితే నిదర్శనం. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో అసౌకర్యాల మధ్య విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదు.

శిథిలమైన హాస్టల్ భవనం

చెన్నూరు ఎస్సీ బాలర హాస్టల్ భవనం 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. అధికారులు మరమ్మతుల పేరిట కాలం గడుపుతున్నారు. విద్యార్థులు ఈ భవనంలోనే భయంగా చదువుకోవాల్సి వస్తుంది. వర్షాకాలంలో కొన్ని గదులు ఉరుస్తున్నాయి. దీంతో విద్యార్థులందరు ఒకే గదిలో ఉండాల్సి వస్తుంది.

అసౌకర్యాలతో అవస్థలు

హాస్టల్‌లో కిటికీలు లేకపోవడంతో రాత్రి వేళలో చలికి, వర్షాకాలంలో పురుగులు, పాములు, విష జీవులు గదుల్లోకి వస్తున్నాయి. ఇక తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో మిషన్ భగీరథ నీటితో సరి పెట్టుకుంటున్నారు. సోలార్ ప్లాంట్ చెడిపోడంతో చలికాలంలో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

-అధికారుల నిర్లక్ష్యం

వివిధ గ్రామాల నుంచి వచ్చే నిరుపేద విద్యార్థులు ఈ దుస్థితతులతో సహవాసం చేయాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని, సౌకర్యాలను మెరుగు పర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.



శిథిలాస్థలో ఉన్న హాస్టల్ భవనం



వసతి గృహంలో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్



హాస్టల్‌లో పెచ్చులూడిన గోడలు

ఘనంగా సహకార వారోత్సవాలు

మంచిర్యాల క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సహకార వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మమత సూపర్ బజార్ ఛైర్మన్ కటకం రవిందర్ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు.

పార్టీలో చేరికలు

తాండూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలోని యువకులు ఆదివారం మండల నాయకుడు వాసాల అనిల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో పెద్ద సంఖ్యలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ జిల్లా అద్యక్షుడు మహేశ్ వర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, తీన్మార్ మల్లన్న పోరాట స్ఫూర్తికి ఆకర్షితులై యువకులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి గ్రామంలో రోడ్డుపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108లో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తితో పాటు గుర్తు తెలియని కారు గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
సోమవారం 17 నవంబరు 2025



కంకాలమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం



- ఇతర రాష్ట్రాల నుంచి రాక
- శివసత్తుల పూనకాలు, మొక్కుల చెల్లింపు
- పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ
- జనసంద్రమైన కౌటాల

కౌటాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంకాలమ్మగుట్టపై నిర్వహించిన కంకాలమ్మ జాతరకు భక్తజనం పోటెత్తారు. దీంతో కౌటాల మండల కేంద్రం జనసంద్రమైంది. ఎటుచూసినా భక్తులు అమ్మవారి దర్శనం కోసం కంకాలమ్మ గుట్ట వైపే చేరుకోవడం కనిపించింది. ఎంతో పురాతనమైన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో 24 సంవత్సరాలుగా మహా జాతర నిర్వహిస్తున్నారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన జాతర మహోత్సవానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు దీపారాధనతో మొదలైన జాతర ప్రముఖులు, స్వామీజీలతో పోటెత్తింది. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వకనయ్య, కళ్యాణీల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరలో పాల్గొన్న భక్తులు తిరుమల తిరుపతి నుంచి వచ్చిన అక్షింతలు, పసుపు కుంకుమ, కంకణాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ

జాతర సందర్భంగా కంకలమ్మ అమ్మవారికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తిరుపతి నుంచి రామనాథంతో పాటు ఉమ్మడి జిల్లా టీటీడీ ప్రచారక్ గుల్లపల్లి సత్య నారాయణ, సభ్యులు చంద్రశేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ ప్రమోద్‌కుమార్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వేల సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

కేవలం తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలిరావడంతో జాతరకు ఎంతో మహత్యం సంతరించుకుంది. భక్తులు గుట్టలపై అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

శివసత్తులు పూనకాలు ఎంతగానో ఆకట్టుకున్నారు. గుట్టపైకి వచ్చే ప్రముఖులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివసత్తులు మండల కేంద్రంలోని ప్రధాన వీధులగుండా భాజా భజంత్రీలతో నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గట్టి బందోబస్తు

అశేష జనవాహిని జాతరకు రాగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ ఆధ్వర్యంలో కౌటాల సీఐ సంతోష్, ఎస్సైలు చంద్రశేఖర్‌తో పాటు సిర్పూర్(టి), చింతలమానేపల్లి, బెజ్జూరు, పెంచికలపేట, దహెగాం, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సైలతో పాటు 200 మంది పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

కంకలమ్మ జాతరను పురస్కరించుకుని కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే కుటుంబ సభ్యులతో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. అలాగే కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా తరలి వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు.






పట్టువస్త్రాలను తీసుకువస్తున్న టీటీడీ సభ్యులు, బోనాలతో తరలి వస్తున్న భక్తులు, శివసత్తులు, పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ దంపతులు, సబ్ కలెక్టర్, మెట్ల దారిలో బారులుతీరిన భక్తులు

చలి గుప్పిట్లో ఏజెన్సీ మండలాలు

- సిర్పూర్(యూ)లో 7.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు



తిర్యాణి మండలం చింతపల్లి గ్రామంలో అలుముకున్న పొగమంచు

ఆసిఫాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాలు చలి గుప్పిట్లో వణికి పోతున్నాయి. వారం రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో తగ్గుముఖం పట్టడంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు చలికి గజగజలాడుతున్నారు. జిల్లాలో ఈనెల 19 వరకు కోల్డ్‌వేవ్ అలర్ట్‌ను వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో జిల్లాలో 9 నుంచి 12 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం జిల్లాలోని సిర్పూర్-యూ మండలంలో 7.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు కాగా తిర్యాణి మండలం గిన్నెధరిలో 8.5 డిగ్రీలు, కెరమెరిలో 9.7 డిగ్రీలు, జైనూరులో 11.2 డిగ్రీలు, వాంకిడిలో 11.3 డిగ్రీలు, రెబ్బెన, కాగజ్‌నగర్‌లో 11.4 డిగ్రీలు, పెంచికల్‌పేటలో 11.9 డిగ్రీలు, బెజ్జూర్, లింగాపూర్, ఆసిఫాబాద్‌లో 12.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలినుంచి ఉపసమనం పొందేందుకు ఏజెన్సీ గ్రామాల ప్రజలు నెగళ్ల ముందు చలిమంటలు కాగుతున్నారు.

బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి



రన్ ఫర్ జస్టిస్‌లో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ జేఏసీ చైర్మన్ రూప్‌నార్ రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం రన్ ఫర్ జస్టిస్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందరభంగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి కుమరం భీం చౌక్ మీదుగా జన్కాపూర్ వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని ప్రధాన మంత్రి వద్దకు తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా ఒత్తిడి తీసుకు రావాల ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, సాయికృష్ణ, ప్రశాంత్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న పాతాశి ప్రజారాజ్

కాగజ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా పోరాట కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం, ఆల్ ఇండియా సంఘం సెక్రెటరీ పాతాశి ప్రజారాజ్ తెలిపారు. ఆదివారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరిలో 14వ జాతీయ మహాసభలు జరుగనున్నట్టు పేర్కొన్నారు. ఈ సభల్లో మహిళల సమస్యలను పరిష్కరించుకునేందుకు మార్గాలు, భవిష్యత్తు కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించేందుకు తీర్మానం చేయనున్నట్టు పేర్కొన్నారు. జాతీయ సంఘటమైన ఐద్వా, మహిళల సమాన హక్కులు, విద్యా, బాల్య వివాహాల నిషేదం, ఆస్తి హక్కు చట్టం, వరకట్న వేధింపులు నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు పోరాట కార్యక్రమాలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత, జిల్లా కార్యదర్శి దుర్గామాత, ఉపాధ్యక్షురాలు మమత రాణా, జిల్లా సహాయ కార్యదర్శి పుల్మల్ల, జిల్లా ఉపాధ్యక్షులు సాహిని తదితరులు పాల్గొన్నారు.

రేపు యువజన కళాకారుల ఎంపిక

ఆసిఫాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనడానికి ఆసిఫాబాద్ జిల్లాలోని యువజన కళాకారులకు ఈ నెల 18న ఆదివాసీ భవన్‌లో యువజన కళాకారుల ఎంపిక నిర్వహిస్తామని జిల్లా యువజన శాఖాధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 29 సంవత్సరాలు ఉన్న యువజన కళాకారులు అర్హులని, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారికి రాష్ట్ర స్థాయికి పంపిస్తామన్నారు. అక్కడ ప్రతిభ కనబర్చిన వారు 2026 జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజనోత్సవాలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం, జానపద పాటలు, ఉపన్యాసం, వకృత్వం అంశాల్లో ఎంపిక నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి గల వారు జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని లేదంటే వివరాలను 8247096710 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

జైనూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని మార్కెట్ కమిటీ గోదాంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత రైతులను శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పంట ధాన్యాలు అమ్ముకునేందుకు రైతులందరికి ఆవకాశంకల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో అనేక మంది గిరిజన రైతులు పంటల వివరాలు ఆన్‌లైన్ నమోదు కాలేదని దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఆదేవిధంగా గిరిజనేతర రైతుల పంట ధాన్యాలు ఆన్‌లైన్‌లో లేనందున వారు అనేక విధాలుగా నష్టపోతున్నారన్నారు. వారి పంట ధాన్యాలు ప్రభుత్వ రంగ సంస్థల ద్వార కొనుగోలు చేయాలని ఈ నెల 15న కలెక్టర్‌కు వివరించామని, త్వరలో గిరిజనేతర రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. మండ లంలో నెలకొన్న సమస్యల్ని సాధ్యమైనంత వరకు పరిష్క రించేందుకు కృషి చేస్తామని భరోసా కల్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావు మాట్లాడుతు ప్రభు త్వం రైతుల పంట ధాన్యాలకు సరైన మద్దతు ధర కల్పి స్తోందన్నారు. క్వింటాలు సోయా 6,328 రూపాయల మద్దతు ధర కల్పిస్తుందన్నారు. ఆదేవిధంగా 12 శాతం తేమ కలిగి ఉండాలని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి జాడి వెంకటి సోయా కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, గంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్, సీఈవో సోనకాంబ్లే జనార్దన్, బీఆర్ఎస్ మండల ఇంతీయాజ్‌లాల, ఉపాధ్యక్షులు ఆత్రం శంకర్, మాజీ ఎంపీటీసీ కుంర భగ్వంత్‌రావ్, నాయకులు లక్కా నాయక్, నాగర్ గోజే విశ్వాంబర్, మాజీ సర్పంచులు కుంర శాంరావ్, మేస్రాం నాగోరావ్, మడావి భీంరావ్, అఫ్సరోద్దిన్, ఉత్తం, ఖదీర్, అయ్యుబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేస్రాం అంబాజీరావ్, మార్కెట్ సిబ్బంది బబ్లు, గాయక్‌వాడ్ దత్త తదితరులు ఉన్నారు.



రైతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గుండెపోటుతో యువ వ్యాపారి మృతి

ఆసిఫాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన యువ వ్యాపారి ప్రముఖ మొబైల్ షాప్ యజమాని పాపిని విక్రమ్(45) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. శనివారం రాత్రి కొంత అనారోగ్యంతో ఉండగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చాడు. ఉదయం స్నేహితులు ఇంటికి వెళ్లిచూడగా ఎటువంటి కదిలికలు లేక పోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అందరితో కలివిడిగా ఉండే విక్రమ్ గుండె పోటుతో మృతి చెందాడనే విషయాన్ని తెలుసుకున్న వ్యాపారులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు అజ్మీరా శ్యాంనాయక్, బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



విక్రమ్(ఫైల్)

ఘనంగా సామూహిక వందేమాతరం గీతాలాపన



వందేమాతర గీతాలాపనలో పాల్గొన్న నాయకులు, పట్టణ వాసులు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో ఆదివారం ఘనంగా సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం నినాదం ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వందేమాతరం ముచ్చెమటలు పట్టించిందన్నారు. ప్రతీ ఒక్కరూ వందేమాతరం గీతాన్ని గుండెల్లో నింపుకొని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ చౌరస్తాతో పాటు ఆయా వ్యాపార సముదాయల వద్ద వ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, విద్యార్థులు జాతీయ పతాకాలను చేతబూని ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు దోని శైలం, మాజీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి నివాస్, పట్టణాధ్యక్షుడు శివ, మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



వందేమాతర గీతం ఆలపిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

హిందూ సమాజ సంఘటితమే దేశ అభ్యున్నతికి మార్గం

- ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్

ఆసిఫాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని సంఘటితంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని సహ ప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభుకుమార్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజసేవ, ఐక్యత, సహాయక భావన వంటి అంశాలను ప్రధానంగా ఉంచుకుని రాష్ట్రీయ స్వయం సేవక సంఘం శతాబ్ది దిశగా చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. సమాజంలోని ఆర్థిక, విద్యా, వైద్య, వంటి పలురంగాల్లో సేవలను అందిస్తూ ఆర్ఎస్ఎస్ నిరంతర కృషి చేస్తోందని పేర్కొన్నారు. స్వార్థాన్ని వదిలి ధర్మం, సమాజ రక్షణ కోసం పనిచేయడం ప్రతీ హిందువు ధర్మమని చెప్పారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో హిందువులపై హింసాత్మక చర్యలు జరుగుతున్నాయని, హిందువులను విడదీసే ప్రయత్నాలు, మత మార్పిడి చర్యలు, యువతను వ్యసనాలకు దారి తీసే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో హిందూ సంస్కృతిని దూరం చేసేందేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు సమాజం ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. హిందువుల జనాభా తగ్గుతున్న నేపథ్యంలో సమాజ రక్షణ కోసం భవిష్యత్ తరాలను బలపరిచే దిశగా ప్రతీ కుటుంబం బాధ్యత వహించాలని సూచించారు. ధర్మానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని ఖండించాలని సమాజ బలోపేతం కోసం అందరు కలిసి ముందుకు రావాలన్నారు. డిసెంబరులో జరుగున్న విరాట్ హిందూ సమ్మేళనం కోసం ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సంఘటిత శక్తిని ప్రదర్శించాలని కోరారు. వచ్చే 25 సంవత్సరాల్లో భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడం లక్ష్యంగా సంఘం పని చేస్తోందని, ప్రతి గ్రామంలో ఒక గంట అయిన శాఖ కార్యకలాపాలకు సమయాన్ని కేటాయించాలని సూచించారు.

అంతకు ముందు జైన్ మందిర్ నుంచి కుమరం భీం చౌక్ మీదుగా సాయిబాబా ఆలయం వరకు పదసంచాలన్ నిర్వహించారు. కార్యక్రమంలో గౌతం చంద్ జైన్, కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ మాదవరపు రంగ్స్వామి, మంచిర్యాల జిల్లా కార్యవాహ కృష్ణభాస్కర్, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అరిగెల నాగేశ్వర్‌రావు, అరిగెల మల్లికార్జున్, బోనగిరి సతీష్ బాబు, జనగామ ఖండ కార్యవాహ కోటేశ్వర్‌రావు, డాక్టర్ వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.



పదసంచాలన్ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్‌లు

గ్రంథాలయంలో ఉపన్యాస పోటీలు



విజేతలకు పుస్తకాలు అందజేస్తున్న అతిథులు

ఆసిఫాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులకు ఉపన్యాస పోటీలతో పాటు కవులకు కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిటైర్డ్ పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు, లైబ్రేరియన్ ప్రవీణ, సదానందం, రికార్డు అసిస్టెంట్ సతీదేవి, సిబ్బంది సలీం, రామయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి మాలధారణ

రెబ్బెన, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలోని కనకదుర్గాదేవి స్వయంభు మహంకాళి దేవస్థానంలో ఆలయ పూజారి దేవర వినోద్‌స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు కాలభైరవ స్వామి మాలధారణ దీక్ష తీసుకున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిర్యాణి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని ఈ నెల 23న ఉట్నూర్‌లో తలపెట్టిన ధర్మ యుద్ధం కార్యక్రమ పోస్టర్లను ఆదివాసీ సంఘాల నాయకులు మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. మోతిరాం, చంద్రశేఖర్, నర్సింగరావు, అర్జున్, రాంచందర్ పాల్గొన్నారు.

రణభేరి మహాసభను జయప్రదం చేయండి



రణభేరి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

రెబ్బెన, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించే మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపు మేరకు నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాలల రణభేరి సభకు తరలిరావాలని కోరారు. అనంతరం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు అనిల్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.